131) దేసాళం/సావేరి

ప॥ జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు। కావక పోరాదు మాకుగలయంతర్యామివి॥

చ॥ పైపై నెదురుకట్ల బంచదార వుండగాను। చేపట్టి యడిగి తెచ్చి చేదు దిన్నట్లు।
పూపలైన చేతిలోనే పుణ్యములు వుండగాను। పాపములు చవియంటా బట్టబొయ్యీ జీవుడు॥

చ॥ యింటిలోనే నవరత్నలెన్నియైనా నుండగాను। కంటిగించి గాజుబూస గట్టుకొన్నట్లు।
వెంటనే హరినామాలు వేయివేలై వుండగా। జంట నితరమంత్రాలు జపియించీ జీవుడు॥

చ॥ చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండగాను। వేసరక వెలయాలి వెతికినట్లు।
మేనుల శ్రీవేంకటేశ మీదాస్యమే వుండగా। వాసి బరుల గొలువనే వడి గోరీ జీవుడు॥